## కథ

డా. తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం

# రంగవల్లి

ధనుర్మాసం అయిపోవస్తున్నా చలి ఏమాత్రం తగ్గలేదు. తెల్లవారుఝాము అయిదు గంటల సమయం. సూర్యోదయం కావడానికి ఇంకా గంటపైన సమయం ఉంది.

నివాస గృహాలు వరుసగా ఉన్న ఆ వీధిలో వీధి దీపాల కాంతి చీకటిని పూర్తిగా తరిమివేయలేక వెలవెలబోతోంది. నున్నగా ఉన్న తారు రోడ్డుకు అటూఇటూ చెట్లు ఉండడం వలన ఉండి ఉండి చల్లనిగాలి రివ్వున పరిగెడుతూంది.

నెమ్మదిగా నడుస్తున్న దంపతుల జంట ఆ చలికి తట్టుకోలేనట్టు ఒకరికొకరు చేరువగా నడుస్తూ ఉన్నారు. అరవై పదుల వయసు దాటిన ఆమె తను కట్టుకున్న వెంకటగిరి జరీ చీరె కొంగును చెవులమీదుగా తలపైకి ముసుగులా వేసుకుంటూ "ఇవాళ చలి ఎక్కువగా ఉంది" అంది కొద్దిగా వణుకుతున్న స్వరంతో.

ఆమె పక్కనే నడుస్తున్న భర్త చొక్కా మీద వేసుకున్న కండువాను శాలువాలా కప్పుకుంటూ "కాస్త కాఫీ తాగి బయల్దేరుదామంటే ఒప్పుకోవు" అన్నాడు కాస్త నిష్ఠూరంగా.

"కాఫీ త్రాగి, టిఫిన్ తిన్నాక ఇక మనం వెళ్లడం దేనికి? ఒక్క నెల్లాళ్లు పొద్దున్నే కాఫీ తాగకుండా ఉండలేమా?" అందావిడ నవ్వుతూ.

ఆసరికి వాళ్లు తమ ఇల్లున్న వీధి దాటి ముఖ్యమైన రహదారిలోకి వచ్చారు. ఇక్కడ వెలుగు బాగానే ఉన్నట్టనిపించింది వారికి. చలికి లేవబుద్ధి కాక వెచ్చగా నిద్రపోతున్న దుకాణాలు, కాలిబాట మీద మునగ దీసుకు పడుకున్న గూడు లేని పేదలు, అప్పుడప్పుడు రయ్యిమని దూసుకుపోతున్న కార్లు ఆ తెల్లవారుఝామున నగరం యొక్క కొత్త ముఖాన్ని చూపెడుతున్నాయి వాళ్లకు.

వాళ్లు ఆ నగరానికి అతిథులు. ఏడాదికొకసారి కొడుకు ఇంటికి వచ్చి, పది రోజులు ఉండి, ఆ జనారణ్యంలో మనుషుల పరుగులు ఉరుకులు చూసి, ఝడుసుకుని తమ ఊరికి పయనమవుతుంటారు. ఈమారు మొదటిసారి సంక్రాంతి పండుగ ముందు కొడుకు దగ్గరకు వచ్చారు.

"వచ్చే ఏడాది సంక్రాంతికి అబ్బాయినీ, కోడల్నీ మన ఊరికి రమ్మందాము. చక్కగా మనవరాలితో కలసి వెళ్లి నలుగుర్ని పిలిచి బొమ్మలకొలువు పేరంటం చేసుకుంటాను" అన్నదావిడ. ఆ మనవరాలి వయసు ఏడాది!

"ఇంకో సంవత్సరం తరువాత మాట కదా! అప్పటికి నీకంత ఓపిక ఉంటే అలాగే చేద్దువు గానీ" ఆయన చిన్నగా నవ్వాడు.

"మనసులో సంకల్పం ఉండాలి గానీ ఓపికదేం ఉంది? అదే వస్తుంది. ఇప్పటి పిల్లలలాగా అన్ని సంప్రదాయాలు వదులుకోలేము కదా!" అన్నదావిడ.

ఉద్యోగస్తురాలైన కోడలు ప్యాంట్లు, షర్ట్లు తొడుగుతుందనీ, జుత్తు కత్తిరించుకుంటుందనీ మగరాయుడిలా స్కూటరు మీద తిరుగుతుందనీ ఆవిడకు అసంతృప్తి.

"తను ఉద్యోగం చేసే చోట నలుగురూ ఉన్నట్టే తనూ ఉండాలి కదా! ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆఫీసుకు వేళకు చేరాలంటే బస్సులు పట్టుకుని వెళ్లడం కుదరదు. ఈ కాలం పిల్ల నీలా ఉండమంటే కుదురుతుందా?" కోడల్ని వెనకేసుకు వచ్చాడాయన.

"అలాకాదు లెండి. ఎంతైనా ఈ కాలం పిల్లలకి మన సంస్కృతీ సంప్రదాయాలంటే గౌరవం, నమ్మకం లేవు" అన్నదామె వేదన నిండిన స్వరంతో.

దగ్గర్లోనే ఉన్న రాములవారి ఆలయం నుండి గంటలు వినబడ్డాయి.

"ఆలస్యమవుతున్నదిలా ఉంది" అంటూ గబగబ అడుగులు వేశాడాయన. ఆమె కూడా నడక వేగం పెంచింది.

అంతలో వారిని దాటుకుంటూ లయబద్ధమైన అడుగులతో ముందుకు పరుగు తీసింది ఒక అమ్మాయి.

పరిగెడుతూనే "గుడ్మాణింగ్" అంటూ వారికి శుభోదయం చెప్పింది.


బూడిద రంగు మీద ఒక వైపు మాత్రం నిలువుగా నల్లని చారలున్న ట్రాక్ సూట్, పైన వదులుగా ఉన్న నీలిరంగు స్వెట్ షర్ట్‌లో ఉన్నదా పిల్ల. కాళ్లకు షూస్.. వదులుగా ఉన్న జుత్తు గాలికి ఆమె అడుగుల లయకు అనుగుణంగా ఎగిరి పడుతూంది.

ఆయన తను కూడా "గుడ్‌మార్నింగ్" అని చెప్పాడు గానీ ఆవిడ మాత్రం ఆ అమ్మాయి దుస్తులనూ, జుత్తునూ, బూట్లనూ గమనించడంలో నిమగ్నురాలై బదులు పలకలేదు.

ఆ యువతి కాస్త దూరంగా వెళ్లిపోగానే ఆవిడ అంది. "చూశారా ఈ కాలం పిల్లలకి జాగింగ్‌లు, ఫిట్‌నెస్ ట్రైనింగ్‌లకి సమయం దొరుకుతుంది. బ్యూటీపార్లర్‌లకి వెళ్లడానికి, జుత్తు కత్తిరించుకోడానికీ టైమ్ముంటుంది. కానీ పండుగలు, పూజలు, దేవుడు, భక్తి లాంటి పాతకాలం చాదస్తాలకు సమయం దొరకదు. అంతే!" అని.

ఆయన బదులు పలుకలేదు. గుడి బయట చెప్పులు వదిలి లోపలికి నడిచారు ఇద్దరూ. స్వామికి ప్రభాత పూజ ఇంచుమించుగా పూర్తికావొస్తోంది. గర్భగుడి వెలుపల అటుఇటు రెండు వరుసలుగా జనం నిలబడి ఉన్నారు. అందులో వయసుమళ్లిన వాళ్లతో బాటు నవ యవ్వనంలో ఉన్న వాళ్లూ ఉన్నారు. ఆవిడ రాముల వారిని కళ్లారా దర్శించుకుని, చేతులు జోడించి నమస్కరించి నిలబడింది.

ఎందుకో ఆవిడకు ఇంతకు ముందు తమని దాటి వెళ్లిన 'జాగింగ్' పిల్ల గుర్తుకొచ్చింది. ఆ కాస్త సమయంలోనూ చెవులు హోరెత్తించే 'పాప్'



మ్యూజిక్ వినకపోతే కొంప మునుగుతుందన్నట్టు ఆ పిల్ల చెవులకు ఇయర్ (హెడ్)ఫోన్ తగిలించుకుని పరిగెత్తడం మనసులో మెదిలింది.

'దేవుని ముందు నిలబడి ఈ ఆలోచనలెందుకు?' అనుకుంటూ మనసులో విష్ణు సహస్రనామం జపించుకోవడానికి ఉద్యమించిందామె.

పూజారి పూజ ముగించి, తెరవేసి నైవేద్యం సమర్పించాక తెరతీసి, హారతి వెలిగిస్తుండగా తన పక్కన ఎవరో పరుగున వచ్చినట్టు తోచి, పక్కకు తిరిగి చూసిందావిడ.

ఇందాక కనబడిన ట్రాక్ సూట్ పిల్ల. చెవులకు హెడ్‌ఫోన్ లేదు. జుత్తును మడిచి బ్యాండ్ పెట్టింది. ఆయాస పడుతూ నిలబడి చేతులు జోడించి భక్తిగా దండం పెడుతూంది రాముల వారికి.

పూజారి హారతి పళ్లెం భక్తుల ముందుకు తీసుకు వచ్చాడు. ఆ అమ్మాయిని చూడగానే చిరునవ్వు నవ్వాడు.

"హారతి వేళకు అందుకోలేనేమో అనుకున్నాను. అదృష్టం కొద్దీ సరిగ్గా సమయానికి వచ్చాను" అంటూ హారతి పళ్లెంలో పది రూపాయల నోటు వేసి, భక్తిగా హారతి కళ్లకు అద్దుకున్నదా అమ్మాయి.

"మీ అమ్మానాన్నల పెళ్లిరోజని ఈ రోజు పూజ నైవేద్యం కైంకర్యానికి అయిదు వందలు కట్టావు. ఇంకా రాలేదేమా అనుకున్నాను" హారతి పళ్లెం లోపల పెట్టి, శఠగోపురం ఆమె తల మీద పెడుతూ అన్నాడు పూజారి. ఆయన మళ్లీ గర్భగుడిలోనికి వెళ్లి అందరికీ ఆకు దొప్పలలో చక్కెరపొంగలి ప్రసాదం తీసుకొచ్చి ఇచ్చాడు. ఆ అమ్మాయికి మాత్రం పెద్ద పొట్లంలో చక్కెరపొంగలి, రెండు కొబ్బరి చిప్పలు, పువ్వులు అందించాడు.

ఒకరొక్కరుగా భక్తులు బయటకు కదిలారు. ముసలి దంపతులిద్దరూ ఒకపక్కగా కూర్చున్నారు. అంతలో ఇందాకటి 'జాగింగ్' పిల్ల వాళ్ల దగ్గరకు వచ్చింది.

"ఆంటీ.. ఒక్క నిముషం ఇవి పట్టుకుంటారా? నేను అశ్వర్ధ వృక్షానికి ప్రదక్షిణలు చేసి వస్తాను" అంటూ తన చేతిలోనున్న ప్రసాదం పొట్లం, కొబ్బరి చిప్పలు ముసలామెకు అందించింది.


"అంతవరకు ఇది వింటూ ఉండండి ఆంటీ" అంటూ చిన్న సి.డి. ప్లేయరు ఆమె ఒడిలో పెట్టి హెడ్ ఫోను ఆమె చెవులకు తగిలించి చెట్టువైపు నడిచిందా అమ్మాయి.


చెవులు బద్దలయ్యే ఇంగ్లీషు పాటేదో వినబడుతుందని ఆవిడ భయంగా చెవులలో నుండి ఇయర్ ఫోన్ తీసేయబోయింది.

గుడిలో జేగంట మోగినట్టు, కంచుకంఠంతో ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి పాడుతున్న 'శ్రీమన్నారాయణ' కీర్తన వినబడడంతో ఆవిడ చేతులు జోడించి, భక్తిగా వినసాగింది. ఈ పిల్ల ఇటువంటి పాటలు కూడా వింటుందా అనుకుంటూ. ఆ అమ్మాయి ప్రదక్షిణలు ముగించుకుని రాగానే ముగ్గురూ నడక సాగించారు.

"మీ అమ్మానాన్నల పెళ్లిరోజని పూజ చేయించావు. మరి వాళ్లు రాకుండా నువ్వు మాత్రమే వచ్చావేం?" సందేహంగా అడిగింది ముసలావిడ.

"అమ్మ, నాన్న నంద్యాలలో ఉంటారు. ఇక్కడ నేను వర్కింగ్ విమెన్స్ హాస్టల్లో ఉంటున్నాను. ఇన్ఫోటెక్‌లో ఇంజినీరుగా పనిచేస్తున్నాను" అన్నదా




అమ్మాయి.

ఇంతలో ముసలి దంపతులు తమ ఇల్లు ఉన్న మలుపు దగ్గరకు రావడంతో ఆగారు. “వస్తామమ్మా. నిన్ను చూస్తే సంతోషమనిపించింది. ఈ కాలం పిల్లలు తమ మూలాల్ని మరచిపోతున్నారన్న ఆలోచన మార్చుకుంటున్నాను” అన్నది పెద్దావిడ.

“ఆంటీ! మేము డిసెంబరు ముప్పై ఒకటవ రాత్రి రెండు గంటల దాకా క్లబ్‌లో గడిపాం అని చెప్తే కోపం వస్తుందేమో మీకు. ఆఫీసులో అందరం కలసి సెలబ్రేట్ చేసుకుంటాం” అన్నదా అమ్మాయి నవ్వుతూ.

“కోపం దేనికమ్మా? విదేశీ పద్ధతులు పాటిస్తున్నా మనదైన సంస్కృతీ సంప్రదాయాల్ని మరచిపోవడం లేదు కదా! మంచి ఎక్కడున్నా అందుకుని కొత్త పాతల్ని మేళవించి ముందుకు నడుస్తున్నారు. మాకు చింత అనవసరం” అన్నది ఆమె.

“బై ఆంటీ, అంకుల్. సీయూ” అంటూ మళ్లీ పరుగు మొదలుపెడుతున్న ఆ అమ్మాయితో “ఈసారి ‘హ్యాపీ వేలంటైన్స్ దే’ కూడా జరుపుకోవాలని ఆశీర్వదిస్తున్నాను తల్లీ” అని మలుపు తిరిగింది షష్టిపూర్తి చేసుకున్న ఆ పెద్ద ముత్తయిదువ నవ్వుతూ.

వాళ్లు ఇల్లు చేరేసరికి బాలభానుని కిరణాలు అంధకారాన్ని తరిమేశాయి. లిఫ్ట్‌లో మూడవ అంతస్తులో అపార్ట్‌మెంట్‌కి వచ్చారు. ఇంటి ముందున్న రెండు గజాల స్థలంలో చుక్కల ముగ్గేసి రంగులు నింపింది కోడలు. తలుపు తెరుచుకోగానే హాల్లో ఈశాన్యం వైపున్న పూజ గదిలో వెండి కుందులలో కాంతులు వెద జల్లుతూ పరంధాముడికి ప్రణమిల్లుతున్నాయి దీపాలు. హాల్లో మరోపక్కన కంప్యూటర్ ముందు కూర్చుని పని చేసుకుంటోంది కోడలు.

ముసలాయన భార్య వైపు చిరునవ్వుతో చూశాడు. ఆవిడ ఆయనకేసి ప్రసన్నంగా చూసి ముసిముసిగా నవ్వి, చక్కెర పొంగలి ప్రసాదం కోడలి చేతికి అందించింది.



## సరికొత్త మనీషా!

నలభయ్యేల్లోకి అడుగుపెట్ట(బో)తున్న మనీషా కొయిరాలా చాలా కాలం గ్యాప్ తర్వాత మూడు సినిమాల్లో నటిస్తోంది. వీటిలో ‘చెహరా’ అనే సినిమాలో డబుల్ రోల్ కూడా చేస్తోందిట. అలాగే మరో సినిమా ‘దో పైసేకి ధూప్’ కూడా తనకి మంచి పేరు తెస్తుందని భావిస్తోంది. గతంలో కంటే బరువు తగ్గి స్లిమ్‌గా తయారైన మనీషా ఈతరం కుర్ర హీరోయిన్లతో పోటీ పడేందుకు సైతం సిద్ధంగా వున్నానంటోందిట తన సన్నిహితుల దగ్గర. మరీ నేపాలి అందగత్తెకి ఇంకెంత ఆదరణ లభిస్తుందో చూడాలి.